# కేటాయించిన నిధులను ఖర్చు చేయాలి

- నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.471 కోట్లు విడుదల చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 21 : నియోజకవర్గానికి బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో రూ.2,931కోట్లు విడుదల చేయించి, నియోజకవర్గంలోని ప్రతి మున్సిపాలిటీ, గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయించానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మున్సిపాలిటీలు, నాలుగు మండలాల్లో పలు అభివృద్ధి పనుల కోసం ఏసీడీపీ, ఎస్డీఎఫ్, బీఎంఎఫ్, హెచ్ఎండీఏ, టీయూసీడీఎఫ్, పంచాయతీరాజ్, టీఎస్ఐఐసీ, ఎన్‌సీడీపీ, హెచ్ఆర్డీసీల నుంచి సుమారు రూ.471కోట్ల నిధులు విడుదల చేయించటంతో పాటు ప్రొసీడింగ్‌లు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇబ్రహీంపట్నంలో 100 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్ కోసం రూ.37 కోట్లు, పెద్దచెరువు సుందరీకరణకు రూ.18 కోట్లు, బైపాస్‌రోడ్డు వెడల్పు కోసం రూ.3.50 కోట్లు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.10 కోట్లు, తుర్కయంజాల్‌కు రూ.15 కోట్లు, ఆదిబట్ల రూ.5 కోట్లు, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీకి రూ.10కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రధాన రోడ్ల వెంట వంతెనల నిర్మాణం, రోడ్డు వెడల్పు పనుల కోసం నిధులు సిద్ధంగా ఉన్నందున ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కొహెడ సమీపంలో పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం రూ.450 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్యారంటీల సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులను ఖర్చు చేసేందుకు నిర్లక్ష్యం వహిస్తున్నందున వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు రైతుబంధు కోసం వెయ్యికండ్లతో ఎదురుచూస్తున్నారని, వెంటనే నిధులను విడుదల చేయాలన్నారు.

**పొంతన లేని లెక్కలతో..**

నష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి జీడీపీవో దేశంలోనే అగ్రభాగాన నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే అని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడ్డారంటూ అసెంబ్లీలో పొంతనలేని లెక్కలు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో తాగునీరు, రోడ్ల వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ, రైతులకు పెట్టుబడి సాయం, పరిశ్రమల ఏర్పాటుతో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఇవేమీ చూడకుండా ఇంటి సంసారాన్ని ప్రపంచానికి చాటి చెప్పటం కాంగ్రెస్‌కు సరైంది కాదన్నారు. శ్వేతపత్రం పేరుతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

## కుటీర పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం



ఎల్లమ్మతండాలో కుటీర పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న మురళీకృష్ణ

మంచాల, డిసెంబర్ 21 : గ్రామాల్లో కుటీర పరిశ్రమలు స్థాపించాలనుకున్న యువతకు తగిన ప్రోత్సాహం అందిస్తామని అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని ఎల్లమ్మతండా, బోడకొండ గ్రామాల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ కుండ్లీ హర్యానా మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ యొక్క అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో బీటెక్, ఎంటెక్‌కు చెందిన 18 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఎల్లమ్మతండా గ్రామంలో పర్యటించి ఆహార ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్లమ్మతండా సర్పంచ్ పద్మ, పంచాయతీ కార్యదర్శి పర్వీన్, విద్యార్థులు, గ్రామస్తులు పాలొన్నారు.

## రైతు కుటుంబాలకు అండగా ఉంటాం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 21 : రైతు కుటుంబాలకు బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అండగా ఉంటుందని చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి అన్నారు. కవాడిపల్లి గ్రామానికి చెందిన మెరుగు శ్రీధర్ నవంబర్16న మృతి చెందాడు. ఆయన భార్య రమకు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో గురువారం రూ. 25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డైరక్టర్ కందాడి మహిపాల్‌రెడ్డి, మజీద్‌పూర్ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## స్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం

మొయినాబాద్, డిసెంబర్ 21: మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ గ్రామ అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ గ్రామంలో ఉన్న అయ్యప్ప భక్తులకు గురువారం అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు కృష్ణ, దామోదర్‌రెడ్డి, అనంతరెడ్డి, రమేశ్‌గౌడ్, సురేశ్‌యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ కుమ్మరి రాము పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

చేవెళ్లటౌన్, డిసెంబర్ 21: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని చేవెళ్ల పట్టణ కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు శ్రీకాంత్ చారి, శ్రీపాదు తెలిపారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్వామి వారు ఉత్తర ద్వారా దర్శనం ఉంటుందని తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి స్వామి వారికి అభిషేకం, ఉదయం 5 గంటల నుంచి ఉత్తరద్వారం ద్వార స్వామి వారి సర్వదర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం 11.30 గంటలకు స్వామి వారి గరుడ సేవ పెద్ద ఎత్తున కొనసాగుతుందని అన్నారు.

## కళాకారులు సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి డిసెంబర్ 21 : 27వ జాతీయ ఉత్సవాల్లో భాగంగా నగరంలో నిర్వహించే సాంస్కృతిక పోటీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద సంగీతం, నృత్యం, కథరచన, పోస్టర్ మేకింగ్, వక్తృత్వం పోటీలు, ఫొటోగ్రఫీ, మిమిక్రీ పోటీలు శుక్రవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకు సరూర్‌నగర్, ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని అన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల వారు అర్హులని తెలిపారు. వివరాల కోసం 9848364143 /9849909077 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూపు (A.P., న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## మైక్ సెట్ వితరణ



మైక్ సెట్‌ను అందజేస్తున్న గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు, డిసెంబర్ 21 : పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు రూ. 10 వేల విలువ చేసే చార్జబుల్ మైక్ సెట్‌ను గురువారం గ్రీన్ మేకర్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సహకారం అందించుటకు ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటయ్య, గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేశ్, సభ్యులు రవికిరణ్, మల్లేశ్, లక్ష్మణ్, నర్సింహ, రంగారావు పాల్గొన్నారు.

## గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలి




రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 21: విద్యార్థులు చిన్నతనం నుంచే గణితంపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుఖేందర్‌రెడ్డి అన్నారు. గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీ, గణిత మేళా, క్విజ్, ఉపన్యాసం, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొంతు పాండురంగయ్య, రమేశ్ పాల్గొన్నారు.



రంగాపూర్ గ్రామంలో అయ్యప్ప స్వాముల సన్నిధాన భవనాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణానికి చాకలిగుట్టతండాకు చెందిన మూడవత్ గబ్రూ చౌహాన్ రూ.1,00,501 విరాళాన్ని స్వాములకు గురువారం అందజేశారు. – నందిగామ, డిసెంబర్ 21

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి





ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఈఈ శివశంకర్ తదితరులు

షాబాద్, డిసెంబర్ 21: గ్రామాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ శివశంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. సదస్సులో విద్యుత్ సమస్యలపై మొత్తం 42 ఫిర్యాదులు అందాయి. గ్రామంలోని కొంతమంది రైతుల పొలాల వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు, కిందికి ఒరిగిన స్తంభాలను అధికారులు వెళ్లి పరిశీలించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం డీఈఈ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు. వారానికి ఒక గ్రామంలో వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ బోర్లకు సంబంధించి డీడీలు కట్టిన రైతులు ఇంకా ట్రాన్స్‌ఫార్మర్‌లు రాలేదని, స్తంభాలు వేయలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి వివరాలను పరిశీలించిన తర్వాత ఒక్కొక్కటిగా పనులు పూర్తి చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ స్వామి, మండల విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, గ్రామ సర్పంచ్ పీసరి అనితారెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సింధు, విద్యుత్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌వోసీ పేద ప్రజల పాలిట వరం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబర్ 21: ఎల్‌వోసీలు పేద ప్రజల పాలిట వరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాంనూతల గ్రామ పంచాయతీకి చెందిన శ్రీకాంత్‌కు మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీని గురువారం బాధితుడికి నగరంలోని తన నివాసంలో అందజేశాడు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

## టెండర్ల ఆదాయం రూ.51.86 లక్షలు

షాద్‌నగర్‌రూరల్,డిసెంబర్21: అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన ఉత్తర రామలింగేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజ సామగ్రి విక్రయించుటకు నిర్వహించిన టెండర్ల ప్రకియ గురువారం పూర్తైంది. 1-02-24 నుంచి 31-01-2025 సంవత్సరం వరకు కొబ్బరికాయలు విక్రయించుటకు నిర్వహించిన సీల్డ్ టెండర్ ద్వారా రాయికల్ గ్రామానికి చెందిన సతీష్ రూ.30 లక్షలకు దక్కించుకున్నారు. లడ్డు, పులిహోర విక్రయాలకు రామేశ్వరానికి చెందిన లింగం రూ.20.35 లక్షలు, తలనీలాలకు రూ.1.51 లక్షలకు ఆంజనేయులు దక్కించుకున్నారు. ఈ సంవత్సరం రూ.51.86 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, ఆలయా ధర్మకర్త ప్రభాకర్‌రావు, ఈవో రామశర్మ, సర్పంచ్ సంపత్‌కుమార్, ఎంపీటీసీ అరుణ పాల్గొన్నారు.



రామేశ్వరంలో టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, నాయకులు